విద్యుత్ సిబ్బందిపై దాడి

వెల్దుర్తి, ఆగస్టు 30: విద్యుత్ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైనట్లు విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్న ఎర్ర నాగయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు నాయక్, శివప్రసాద్‌లపై గ్రామానికి చెందిన నాయిని నర్సాగౌడ్ దాడిచేసినట్లు తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో సిబ్బందితో కలిసి శుక్రవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి

అనిల్‌కుమార్ (ఫైల్)

పాపన్నపేట, ఆగస్టు 30: నీట మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన వనదుర్గా ప్రాజెక్టు ఎఫ్ఎన్ కెనాల్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మెదక్‌కు చెందిన తూర్పు అనిల్‌కుమార్ (30) గురువారం కుటుంబీకులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. అక్కడ స్నానం చేసేందుకు వనదుర్గా ప్రాజెక్టు ఎఫ్ఎన్ కెనాల్ వద్దకు వెళ్లి నీటిలో దిగాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి గజ ఈతగాళ్లతో గాలించారు. నీటిలో అనిల్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలో విద్యుతు సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా మరమ్మతులు చేపట్టుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జావెద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం, బారాహిమామ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఒకేషనల్ అధ్యాపకులకు శిక్షణ

రామాయంపేట, ఆగస్టు 30: ఒకేషనల్ అధ్యాపకులకు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ రేడియంట్ ఇనిస్టిట్యూట్‌లో ఐదు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ హిమజ్యోతి తెలిపారు. రామాయంపేట, మెదక్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లకు కో ఆర్డినేటర్లు ప్రదీప్, దినేశ్ సబ్జెక్టుల వారీగా శిక్షణనిస్తున్నారు. విద్యార్థులను ప్రాక్టికల్‌గా తీర్చిదిద్దడానికి రేడియంట్ టెక్నాలజీని అందజేస్తున్నట్లు తెలిపారు.

తెలుగుభాష గొప్పదనాన్ని చాటిచెప్పాలి

రామాయంపేట, ఆగస్టు 30: తెలుగు భాష గొప్పదనాన్ని చాటిచెప్పాలని వివేకానంద ఆవాస విద్యాలయ కార్యదర్శి సంగమేశ్వర్ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని విద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పండరీనాథ్ ఉన్నారు.

రేపు మంద కృష్ణ మాదిగ రాక

శివ్వంపేట, ఆగస్టు 30: మండలంలోని పాంబండలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సెప్టెంబర్ 1న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ రానున్నట్లు జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాదిగ శుక్రవారం తెలిపారు.

నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణారావు

నర్సాపూర్, ఆగస్ట్ 30: నర్సాపూర్ కమిషనర్‌గా డాక్టర్ రామకృష్ణారావు బదిలీపై వచ్చారు. ఆయన జీహెచ్ఎంసీ డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) పనిచేస్తున్నారు. జైత్‌రామ్ నాయక్‌ను తదుపరి పోస్టింగ్ కోసం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆయనను ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి కృషి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 30: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాయిలెట్స్ నిర్మించేందుకు రూ.15 లక్షలు ఇవ్వనున్నట్లు ఎన్‌వీ లక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నిష్టల మోహన్ తెలిపారు. ప్రిన్సిపాల్ ఆయనను సన్మానించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
KIDNY STONES
★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.
NT- 332617
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- మెనూ ప్రకారం భోజనం అందించాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల వార్డెన్లతో సమీక్షా సమావేశం

నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తిలో బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, ఆగస్టు 30: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ వార్డెన్లపై ఉన్నదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ వార్డెన్లతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వసతి గృహాల వార్డెన్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంపీడీవో మధులత, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

నాయకుడి తల్లి అంత్యక్రియలకు ఎమ్మెల్యే హాజరు

వెల్దుర్తి, ఆగస్టు 30: బీఆర్ఎస్ శేట్‌పల్లి గ్రామ నాయకుడు పడిగె నర్సింహులు తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, లక్ష్మమ్మ అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం నర్సింహులును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, శేఖర్, అశోక్‌గౌడ్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరాలి: డీఈవో

నర్సాపూర్‌లో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంఈవో బుచ్చానాయక్

పాపన్నపేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

చిన్నశంకరంపేట ప్రభుత్వ పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

పాపన్నపేట, ఆగస్టు 30: క్రీడల్లో ఉన్నతస్థాయికి చేరాలని డీఈవో రాధాకిషన్ తెలిపారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అండర్ 14, 17 బాలికలకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి, హెచ్ఎంలు మహేశ్వర్, సురేందర్‌గౌడ్, అంజాగౌడ్, వీరేశం, పద్మ, శ్రీనివాస్‌రావు, పీఈటీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు

చిన్నశంకరంపేట, ఆగస్టు 30: చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ శుక్రవారం కొనసాగాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి కనబర్చాలి

నర్సాపూర్, ఆగస్టు 30: బాల్యం నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంఈవో బుచ్చానాయక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్-14, అండర్-17 పోటీలు ప్రారంభించారు. నోడల్ ఆఫీసర్ తారాసింగ్, పీఆర్‌టీయూటీఎస్ నర్సాపూర్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, సామ్యానాయక్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు ఆంజనేయులు, శ్రీకాంత్‌గౌడ్, మొయిజుద్దీన్, రవి పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ముందుకు రావాలి

- మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

చిన్నశంకరంపేట: మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

చేగుంటలో పండ్ల వ్యాపారం చేస్తున్న మహిళా సభ్యురాలితో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్‌రావు

చిన్నశంకరంపేట, ఆగస్టు 30: పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకురావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని ఈజీఎస్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో 50 ఎకరాల్లో తోటలు పెంచాలని ఈజీఎస్ సిబ్బందికి ఆదేశించారు. గ్రామానికి ఐదు చొప్పున ఫాంపాండ్లు నిర్మించాలన్నారు. సమావేశంలో ఏపీవో రాజకుమార్, టీఏలు సంపత్, యాదగిరి, అమరావతి, గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట, ఆగస్టు 30: గ్రామీణ ప్రాంతాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. చేగుంటలో మహిళా శక్తిలో రుణాలు పొంది కిరాణం, పండ్లు, చెప్పుల వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను శుక్రవారం పరిశీలించారు. సభ్యులు పొందుతున్న ఆదాయాలు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీ సూచించారు. ఆయనతో ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, సీసీ శ్వేత, వీవోలు ఉన్నారు.

ప్రత్యేక ఫోన్ యాప్‌లో రుణమాఫీ నిర్ధారణ


చేగుంట: జెప్తిశివునూర్‌లో పంట రుణమాఫీ దరఖాస్తులను స్వీకరిస్తున్న డీఏవో

- రైతు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలి
- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

చేగుంట/చిలిపిచెడ్/శివ్వంపేట, ఆగస్టు 30: ప్రతి రైతుకు సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలను తప్పని సరిగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖా అధికారి గోవింద్ పేర్కొన్నారు. నార్సింగి మండలం జెప్తిశివునూర్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వివరాలు నమోదును డీఏవో శుక్రవారం పరిశీలించారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని చిలిపిచెడ్ ఏడీఏ పుణ్యవతి తెలిపారు. మండలంలోని ఫైజాబాద్‌లో రుణమాఫీ రాని వారి ఇంటికి ఏవో రాజశేఖర్‌గౌడ్‌తో వెళ్లి వివరాలు సేకరించారు. శివ్వంపేట మండలంలోని దొంతి గ్రామంలో రుణమాఫీ అర్హత ఉండి రేషన్ కార్డు లేని రైతులు, కుటుంబ సభ్యుల వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి అప్‌లోడ్ విధానాన్ని పరిశీలించారు.

చిలిపిచెడ్: ఫైజాబాద్‌లో వివరాల సేకరిస్తున్న ఏడీఏ పుణ్యవతి, ఏవో రాజశేఖర్‌గౌడ్

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం


ఫిక్స్‌డిపాజిట్ బాండ్‌ను చిన్నారులకు అందజేస్తున్న మోహన్ నాయక్

రామాయంపేట/నిజాంపేట, ఆగస్టు 30: దంతెపల్లి గిరిజన తండాకు చెందిన చిన్నారుల పేరిట రూ.10 వేలు ఫిక్స్‌డిపాజిట్ చేసిన బాండ్‌ను డాక్టర్ మోహన్‌నాయక్ శుక్రవారం అందజేశారు. నిజాంపేటకు చెందిన ఆటో డ్రైను 5 రోజుల క్రితం కాలేయ సంబంధ వ్యాధితో మృతి చెందాడు. గ్రామస్తులు చందాలు వేసుకుని డ్రైను అంత్యక్రియలు చేశారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రెండేండ్ల క్రితం కరోనాతో తల్లి, రోజుల వ్యవధిలో తాత, తండ్రి మృతి చెందారు. దీంతో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. బాధిత చిన్నారులను డాక్టర్ మోహన్‌నాయక్ పరామర్శించారు. మృతుడి పెద్ద కూతురు సుప్రియ పేరిట ఏపీజీవీ బ్యాంకులో రూ.10 వేలు ఫిక్స్ డిపాజిట్ చేస్తానని తెలిపారు.

వెల్దుర్తిలో ఘనంగా నేషనల్ స్పేస్ డే

ఉపగ్రహాలు, వాటి ఉపయోగాలపై విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

వెల్దుర్తి, ఆగస్టు 30: నేషనల్ స్పేస్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు రాకెట్‌లు, ఉపగ్రహాలపై వెల్దుర్తి జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్ చంద్రయాన్-3, ఇస్రో ప్రయోగించిన రాకెట్లు, సాధించిన విజయాలను వివరించారు. రాకెట్ తయారీ, ప్రయోగం వాటితో కలిగే లాభాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్పేస్ ఆన్ వీల్స్ వాహనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాకెట్, చంద్రయాన్-3, రాకెట్ల విడిభాగాలు, ఉపగ్రహాలు, అంతరిక్షం నమూనాలు, వాటి పనితీరును వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, ఎంఈవో యాదగిరి, హెచ్ఎం సాంబయ్య పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించే దాకా పోరాడుతాం

మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్

- మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్ గౌడ్

తూప్రాన్, ఆగస్టు 30: మున్సిపాలిటీలో పెంచిన ఇంటి పన్నులు తగ్గించేవరకు పోరాడుతామని మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం తూప్రాన్‌లోని శివసాయి గార్డెన్స్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇంటి పన్నులు తగ్గించాలని బీఆర్ఎస్ తరపున పోరాడుతుంటే కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. తాము శాంతియుతంగా పోరాటం చేస్తుంటే 19 మందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. వ్యాపార, వాణిజ్య వర్గాలతో సంప్రదించి, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచడానికి ట్యాక్స్ పెంచామన్నారు. పన్నులు పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఇంటి పన్ను పెంపును పూర్తిగా ఉప సంహరించుకుంటామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇవ్వకుంటే, తూప్రాన్ బంద్‌కు పిలుపునిచ్చి, కార్యాలయం ఎదుట దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బొంది వెంకట్‌గౌడ్, భైరం సత్యలింగం, షేక్ సత్తార్, శ్రీకాంత్ తదితరులున్నారు.

పార్శ్వనాథుని తీర్థంకర విగ్రహం చోరీ

అల్లాదుర్గం, ఆగస్టు 30: జైన మత పార్శ్వనాథుని తీర్థంకర విగ్రహం చోరీకి గురైన ఘటన టేక్మాల్ మండలం వెల్పుగొండ గ్రామంలోని దేవతల గుట్టలో జరిగింది. ఏఎస్సై దయానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్పుగొండ గ్రామస్తులు ఈ విగ్రహాన్ని వారసత్వ సంపదగా కొలుస్తారు. ఈ విగ్రహాన్ని చివరిసారిగా సూరంపల్లికి చెందిన కమ్మరి బ్రహ్మం చూశాడు. శుక్రవారం ఉదయం అదే గ్రామవాసి తాడూరి సాయిలు తన మేకలు మేపడానికి దేవతల గుట్టపైకి వెళ్లాడు. అక్కడ విగ్రహం కనపడలేదు. విషయం తెలిసిన గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూడగా విగ్రహం కనడలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిన్నతనంలో పెండ్లిళ్లతో ఆరోగ్య సమస్యలు

చేగుంట, ఆగస్టు 30: చిన్నతనంలో పెండ్లిళ్లు చేయడంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని మెదక్ సఖీ కేంద్రం కేసు వర్కర్ ఎం. కళావతి తెలిపారు. నార్సింగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు సఖీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. గృహహింస, వరకట్నం, వేధింపులు, బాల్యవివాహాలు, బాలకార్మికులు, మానవ అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, అత్యాచారాలు, శారీరక మానసిక లైంగిక, ఆర్థిక పరమైన వాటికి గురైతే సఖీ కేంద్రాన్ని సంప్రదించాలని కళావతి అన్నారు. అలాంటి సమయంలో రిస్క్ వాహనం వచ్చి రక్షణ ఇస్తుందన్నారు. ఎవరి సపోర్టు లేకుంటే తాత్కాలిక వసతి కల్పిస్తుందన్నారు. బాధితులు నేరుగా 181 కాల్ చేయాలని, 112, 1098, 1930 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పారా మెడికల్ అధికారి మంజుల, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పాలంపల్లి గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అధికారి బ్రహ్మాజి

చేగుంట, ఆగస్టు 30: గ్రామాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అధికారి బ్రహ్మాజి తెలిపారు. మండలంలోని పాలంపల్లి గ్రామంలోని నర్సరీని శుక్రవారం సందర్శించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే ఈగలు, దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. ఆమెతో చేగుంట ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ స్థాయి సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత


వెల్దుర్తిలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి

రామాయంపేట, ఆగస్టు 30: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి చికిత్స కోసం ఎమ్మెల్యే రోహిత్‌రావు రూ.2.50 లక్షల ఎల్‌వోసీని శుక్రవారం అందజేశారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు సమీపంలో వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన తిరుపల్లి మల్లారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితుడి చికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని కాంగ్రెస్ నాయకుడు కమ్మరి రమేశ్ ద్వారా బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

వెల్దుర్తి, ఆగస్టు 30: వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం అండగా నిలుస్తున్నదని పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. దామరంచకు చెందిన కుమార్‌గౌడ్ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స చేసుకున్నాడు. దీంతో అతడు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.37,500 మంజూరయ్యాయి. శుక్రవారం కుమార్‌గౌడ్‌కు రాజిరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

యశ్వంత్ (ఫైల్)

నర్సాపూర్, ఆగస్టు 30: మంచిగా చదువుకోమని తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నచింతకుంట గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచింతకుంటకు చెందిన దొరవారి యశ్వంత్ (18) హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కాలేజీలో చదువుతున్నాడు. అక్కడ నచ్చక ఇంటికి రావడంతో తండ్రి కిషన్ మందలించాడు. దీంతో యశ్వంత్ మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రావిచెట్టుకు పూజిస్తున్న మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్

పెద్దశంకరంపేట, ఆగస్టు 30: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక సరస్వతి శిశుమందిరంలో ప్రకృతి వందన్‌లో భాగంగా 100 ఏండ్లకు పైబడిన రావి చెట్టుకు పూజించారు. చెట్లతో పర్యావరణం బాగుంటుందన్నారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సుభాశ్‌గౌడ్, ప్రధానాచార్యుడు వీరప్ప, బాధ్యులు రవివర్మ, సీతారామారావు, సతీశ్‌గౌడ్, శైలేశ్, శ్రావణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో కుంకుమార్చన


పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్

నిజాంపేట, ఆగస్టు 30: నిజాంపేటలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు రామ్మోహన్ శర్మ పంచామృతాలతో అభిషేకం చేయగా, ముదిరాజ్ సంఘం సభ్యులు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పంజా బాబు, సభ్యులు జాల పోచయ్య, జాల శ్రీకాంత్, గెరుగంటి బాబు, తమ్మలి రమేశ్, వెంకటస్వామి, నాగరాజు, స్వామి, రాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించిన డీఎల్‌పీవో

ఓటరుజాబితాను పరిశీలిస్తున్న మెదక్ డీఎల్‌పీవో సురేశ్‌బాబు

పెద్దశంకరంపేట, ఆగస్టు 30: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటరు జాబితాను పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో డీఎల్‌పీవో సురేశ్‌బాబు శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు జాబితాలోని తప్పుల సవరణను పూర్తి చేసి సెప్టెంబర్ 6న అన్ని పంచాయతీల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. డీఎల్‌పీవో వెంట ఎంపీడీవో రఫీకున్నీసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.